భూ సేకరణ పనులు వేగంగా పూర్తిచేయాలి

ఆర్అండ్‌బీ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

మామిళ్లగూడెం, మే 23 : జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్అండ్‌బీ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వినయ్‌కృష్ణారెడడి మాట్లాడుతూ మున్నేరు నదిపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్, సీతారామ ఎత్తిపోతల పథకం, జాతీయ రహదారుల నిర్మాణం వంటి పనులకు అవసరమైన భూ సేకరణ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రైతులు, భూ నిర్వాసితులతో నేరుగా చర్చిస్తూ ఎటువంటి ఆందోళనలు జరగకుండా సానుకూల వాతావరణంలో ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. పరిహారం అందించే విషయంలో పొరపాట్లు జరగకుండా చూడాలని, చట్టప్రకారం సంపూర్ణ పరిహారం రైతులకు

అధికారులతో మాట్లాడుతున్న వినయ్‌కృష్ణారెడ్డి

అందేలా అధికారులు పనిచేయాలని తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జి.నర్సింహారావు, ఎల్.రాజేందర్, ఇరిగేషన్ అధికారులు, కలెక్టరేట్ భూ సేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్నింగ్, లాంగ్‌జంప్

ఖమ్మం అర్బన్, మే 23 : ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం శుక్రవారం సందడిగా మారింది. విద్యార్థులు రన్నింగ్, లాంగ్‌జంప్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. అండర్-8, అండర్-10, అండర్-12 కేటగిరిల్లో పోటీలు నిర్వహించగా 124 మంది ప్రతిభ చాటారు. వారిలో 86మంది బాలురు, 38 మంది బాలికలు 60 మీటర్లు, 200 మీటర్లు, 300 మీటర్లు, 600 మీటర్లు పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో పోటీలు జరిగాయి. వాటిల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని ప్రకటించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జూన్1వ తేదీన జింఖాన గ్రౌండ్స్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్ పోటీలకు హాజరుకానున్నట్లు కార్యదర్శి షఫిక్ అహ్మద్ తెలిపారు. ఈ ప్రక్రియలో కోచ్ గౌస్, అధ్యక్షుడు మందుల వెంకటేశ్వర్లు, సుధాకర్, రవి, క్రిష్ణయ్య, నక్క వెంకటేశ్వర్లు, ముజాహిద్, నవీద్, హలీమ్, సీనియర్ అథ్లెట్ ప్రియాంక పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న షఫీక్ అహ్మద్

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ పర్యటన

శుభ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం, మే 23 : మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం ఖమ్మం నగరం, రఘునాథపాలెం, చింతకాని మండలాల్లో పర్యటించి పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు డోకుపర్తి సుబ్బారావు కుమార్తె లోహిత వివాహ వేడుకకు హాజరై వధువుకు చీరాసారే సమర్పించి రూ.50 వేల పెళ్లి కానుక అందజేసి ఆశీర్వదించారు. న్యాయవాది అయితం రవీంద్ర కుమారుడు తరుణ్ రామ్- సిరివెన్నెల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. చింతకాని మండలం కొదుమూరులో దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు బడే సాహెబ్ కుమారుడు ఆరిఫ్ హుస్సేన్-అమిషా బేగం వివాహానికి, రఘునాథపాలెం మండలం కోయచెలకలో బీఆర్ఎస్ నాయకుడు అమరం వెంకటేశ్వర్లు కుమారుడు సందీప్ -త్రివేణి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఖమ్మం ప్రకాష్‌నగర్‌లోని దడాల మహేష్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు.. వారి ఇంటికెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఖమ్మంరూరల్ మారెమ్మ తల్లి టెంపుల్ వద్ద కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ మనవడు వేదాన్ష్ అన్నప్రాసన మహోత్సవానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మండల అధ్యక్షుడు వీరూనాయక్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, డోన్వాన్ రవి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, యూత్ అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్, మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేష్, సీనియర్ నాయకుడు అమరగాని వెంకన్న, మాజీ సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్, మెంటం రామారావు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, చెరుకూరి ప్రదీప్, నాయకులు గొల్లపుడి రాంప్రసాద్, చిలకల వెంకటనర్సయ్య, దడాల రఘు, పాలడుగు పాపారావు, కొప్పెర నరసింహారావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి సత్కారం

జగదీశ్‌రెడ్డిని సత్కరిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం, మే 23 : ఖమ్మం నగరంలో శుక్రవారం జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, విజయ్‌కుమార్, అమరగాని వెంకన్న, మాటేటి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్క్‌లో ప్రైవేట్ కళాశాలల ప్రతిభ

కృష్ణవేణి విద్యార్థులతో యాజమాన్యం

రెజోనెన్స్ విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మం అర్బన్, మే 23 : ఖమ్మం నగరంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు బీఆర్క్ ఫలితాల్లో సత్తా చాటినట్లు ఆయా కళాశాలల యాజమాన్యాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

కృష్ణవేణి..

ఖమ్మం నగరంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు బీఆర్క్, బీప్లానింగ్ ఫలితాల్లో సత్తా చాటినట్లు డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు మణిచంద్రసాయి-95, తరుణ్-242, సమద్-369, అభిజిత్-676వ ర్యాంక్‌తో రాణించారు. 5వేలలోపు 30మంది విద్యార్థులు ర్యాంక్‌లు సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కృష్ణవేణి జూనియర్ కళాశాల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, డీన్ ఏలూరి వంశీకృష్ణ, ఏవో నిరంజన్‌కుమార్ అభినందించారు.

రెజోనెన్స్..

ఖమ్మం నగరంలోని రెజోనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు బీఆర్క్, బీప్లానింగ్‌లో జాతీయస్థాయిలో సత్తా చాటారని డైరెక్టర్స్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. కార్తికేయ-2వ ర్యాంక్, భవగ్న్య-829, రాకేష్-997వ ర్యాంక్ సాధించారు. 5వేలలోపు 25మంది సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సైబర్ నేరస్తుడి అరెస్టు

నేరస్తుడిని చూపిస్తున్న పోలీసులు

మామిళ్లగూడెం, మే 23 : ఖమ్మానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి డబ్బులు దోచుకున్న వ్యక్తిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు కర్నాటకలో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరంలోని టీచర్స్ కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి నాగుల బ్రహ్మంకి ఫోన్ చేసి మేము ముంబాయి పోలీసులమని, మీరు మనీ లాండరింగ్‌కు పాల్పడారని, అరెస్టు చేస్తామని బెదిరించారు. దీంతో నిందితుడు గతేడాది అక్టోబర్‌లో పలు దఫాలుగా సుమారు రూ.1.12 కోట్ల వరకు సమర్పించాడు. ఈ కేసులో రూ.32 లక్షలు అకౌంట్‌కి వెళ్లిన మహ్మద్ జాఫర్ బెల్గాం అనే వ్యక్తిని కర్నాటకలోని హుబ్లీలో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితున్ని సైబర్ క్రైమ్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్యపాత్ర వహించిన సైబర్ క్రైమ్ డీఎస్పీ సీహెచ్ ఆర్వీ ఫణీందర్, ఎస్ఐలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, సైబర్ క్రైమ్‌స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ ఈ సందర్భంగా అభినందించారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం అర్బన్, మే 23 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 2,334 మందికి 2,140 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 172 మందికి 151మంది హాజరై 21 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్, డీఈసీ సభ్యులు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో రవిబాబు

చిట్టెమ్మకు నివాళి

ఖమ్మం రూరల్, మే 23: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో నివాసం ఉంటున్న అడెపు చిట్టెమ్మ(74) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మృతురాలి ఇంటికెళ్లి చిట్టెమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు దండి రంగారావు, సురేందర్, రాము, వరణ్‌తేజ్, దేవయ్య, గోపి ఉన్నారు.

రామశాస్త్రికి నివాళి

బోనకల్లు, మే 23: ఎంపీఈవో సుబ్రహ్మణ్యశాస్త్రి పితృమూర్తి పట్టాభి రామశాస్త్రీ, బోనకల్లు గ్రామానికి చెందిన గంగుల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ బానోత్ కొండ ఇరువురి భౌతికకాయాలను సందర్శించి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

కొణిజర్ల, మే 23: బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు ఎస్‌కే.ఖాసీం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కొణిజర్లలో మాట్లాడారు. ప్రజల కోసం, ఆదివాసీల హక్కుల కోసం, ప్రజలను చైతన్యవంతులను చేయడానికి అడవి బాట పట్టిన మావోయిస్టు నాయకులను కాల్చి చంపడం లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల్లో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను మేధావులు, ప్రజాస్వామికవాదులు, విద్యావేత్తలు ఖండించాలని కోరారు.

యూటీ పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాలి : ఎంపీ పొంగులేటి

యూటీ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, మే 23: పాలేరు ప్రధాన కాలువ యూటీ పనుల్లో అలసత్వం లేకుండా యుద్ధ ప్రాతిపదికన చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం యూటీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత సెప్టెంబర్ 1న వచ్చిన అకాల వర్షాలకు ఈ కాలువకు గండి పడిందని అప్పటి నుంచి యూటీ నీటిని మళ్లించేలా చేశామన్నారు. వర్షా కాలం రావటానికి కంటే ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రిజర్వాయర్ సమీపంలో హట్యాతం వద్ద జరిగిన ప్రమాదంలో యూటీ పూర్తిగా కొట్టుకుపోవడంతో యూటీ పనులను పరిశీలించారు. నాణ్యాత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దన్నారు. కార్యక్రమంలో క్యాంపు ఆఫీస్ ఇన్‌చార్జి భీమ్‌రెడ్డి శ్రీనివాసరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యానారాయణరెడ్డి, ఎడవల్లి రాంరెడ్డి, బజ్జూరి వెంకటరెడ్డి, బత్తుల ఉప్పయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

పెనుబల్లి, మే 23: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ నిర్మాణంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 599 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పెనుబల్లిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, కల్లూరు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్లు భాగం నీరజ, చైర్మన్ దోమ ఆనందబాబు, కోటేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి, మే 23: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా శుక్రవారం పట్టణ శివారులోని రాణి సెలబ్రేషన్ ఫంక్షన్‌హాల్‌లో ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి లబ్ధిదారులకు ఇందిరమ్మ పట్టాలు పంపిణీ చేశారు. పట్టణ పరిధిలో 369 మందికి, మండలంలోని అన్ని గ్రామాల వారీగా 581 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, ఎంపీడీవో నాగేశ్వరరావు, తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలన్ని ఒకే దగ్గర చేర్చడం నష్టదాయకం

మధిర, మే 23: పాఠశాలలన్ని ఒకే దగ్గర చేర్చడం నష్టదాయకమని, విద్యా సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే విధంగా ఉండాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మధిర సీపీఎస్ ఆవరణలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా మాజీ అధ్యక్షుడు మోత్కూరి మధు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.బ్రహ్మారెడ్డి, రాష్ట్ర, జిల్లా బాధ్యులు రెబ్బా శ్రీనివాసరావు, తూమాటి కృష్ణారావు, రత్నకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులు పంపిణీ

తల్లాడ, మే 23: మండలంలోని బిల్లుపాడు క్రాస్ రోడ్డు వద్ద గల ఆర్‌బీ గార్డెన్స్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి ఇందిరమ్మ గృహాల నిర్మాణం కోసం ఉత్తర్వులు పంపిణీ చేస్తారని ఎంపీడీవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తల్లాడ, మే 23: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మల్లారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన కొమ్మగిరి బలరాం(45) గ్రామ ఎస్సీకాలనీ సమీపంలో ఉన్న చికెన్‌షాపు వెనుక వెళ్లగా అక్కడ విద్యుత్ ఎర్త్‌వైర్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు ఏఎస్సై జీవీఆర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తెలు ఉన్నారు.

తిరుమలాయపాలెంలో చోరీ

తిరుమలాయపాలెం, మే 23: తిరుమలాయపాలెంలో శుక్రవారం పగిళ్ల రామకృష్ణ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ సభ్యులందరూ ఖమ్మంలో పనికి వెళ్లారు. ఇంట్లో ఎవరులేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు నక్లెస్, రెండు ఉంగరాలు, మాటీలు, దిద్దులు, వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన వస్తువుల విలువ రూ.93,600 ఉంటుందని బాధితుడు తెలిపారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మైనర్లకు మొబైల్స్, బైకులు ఇవ్వద్దు

వైరాటౌన్, మే 23: మైనర్లకు పిల్లలకు ద్విచక్ర వాహనాలు, మొబైల్స్ ఇవ్వద్దని వైరా ఎస్సై పి.రామారావు తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడారు. వాహనదారులు వాహనాలకు నెంబర్ ప్లేట్స్ లేకుండా నడుపవద్దని, రోడ్లపై వాహనాలు కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారి భవిష్యత్తును పాడుచేయవద్దని సూచించారు.

నేడు మెగాజాబ్ మేళా

వైరాటౌన్, మే 23: వైరాలో శనివారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకుడు పమ్మి అశోక్ అన్నారు. శుక్రవారం వైరాలో ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో సుమారు 80రకాల కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలేటి నర్సింహారావు, తోటకూర గోపి, మల్లు రామకృష్ణ, ధరావత్ శంకర్‌నాయక్, కంభంపాటి సత్యనారాయణ, కుమ్మరికుంటల ఉపేందర్, చల్లగొండ్ల సురేష్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం యూత్ కమిటీ ఎన్నిక

వైరాటౌన్, మే 23: నాయీబ్రాహ్మణ జిల్లా కన్వీనర్ నంద్యాల నర్సింహారావు ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ వైరా మండల యూత్ కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా కుదురుపాక దర్గయ్య, యూత్ కమిటీ అధ్యక్షుడిగా యలమందల అశోక్‌ను ఉపాధ్యక్షుడిగా సాంబ, కార్యదర్శిగా ఎర్రనాగుల సతీశ్, కోశాధికారిగా మంచికంటి శంకర్, జాయింట్ సెక్రటరీగా జంపాల ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా కుదురుపాక శ్రీకాంత్, గుండెమెడ గోపి, వెదురుపాక నాగరాజు, కొంగర సత్యనారాయణ, మంచికంటి నరేష్, ఎర్రనాగుల వెంకటకృష్ణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుదురుపాక వెంకటేశ్వర్లు, రావులపాటి శ్రీనివాసరావు, యలమందల జగదీష్, గుండ్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల సందర్శన

మాట్లాడుతున్న అనుమోలు కోటేశ్వరరావు

ఎర్రుపాలెం, మే 23: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న మండల స్థాయి శిక్షణ తరగతులను యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శెలవులను శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ తరగతుల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి దోహదం చేస్తాయన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు తలపెట్టిన ఎన్‌రోల్‌మెంట్ జీపుజాతలో ఉపాధ్యాయులు పాల్గొని ఎన్‌రోల్‌మెంట్‌కు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను పీఆర్‌సీను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి నంద్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు, శివపార్వతి, సైదారావు, సుబ్బరామరాజు, డీవీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఖమ్మం నగర పరిశుభ్రత మనందరి బాధ్యత

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, మే 23 : అభివృద్ధిలో ముందంజలో ఉన్న ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మంత్రి, మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 2వ డివిజన్‌లోని పాండురంగాపురంలో పర్యటించి కోటి రూపాయలతో నిర్మించనున్న డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగర అభివృద్ధి పనులు గ్రౌండింగ్ కావాలని, ప్రభుత్వ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావు, దొండపాటి వెంకటేశ్వరరావు, మేయర్ నీరజ, ఆర్డీవో నర్సింహారావు, కార్పొరేటరు, అధికారులు పాల్గొన్నారు.

భయబ్రాంతులకు గురిచేసిన సైకో

మధిర, మే 23: పట్టణంలోని ఆజాద్‌రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి సైకోలా వ్యవహరిస్తూ హల్‌చల్ చేస్తూ భయబ్రాంతులకు గురిచేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. ఇళ్లలోకి చొరబడెందుకు ప్రయత్నిస్తుండగా మహిళలు భయబ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు సైకోను కొంత మంది యువకులు బయటకు తీసుకువచ్చి పంపిస్తుండగా వారిపై తిరగబడ్డాడు. అయినప్పటికీ అతనిని కొట్టకుండా బయటకు పంపించి వేశారు. మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు ఉపయోగించే పార తీసుకొని అక్కడున్న వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో సమయ స్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. దాడిలో ఉమామహేశ్వరరావుకు స్వల్పగాయాలయ్యాయి.

పలు కుటుంబాలకు సండ్ర పరామర్శ

కృష్ణయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మే 23: మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, సొసైటీ చైర్మన్ మామిళ్లపల్లి కృష్ణయ్య ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం ఆయన స్వగృహానికి వెళ్లి కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయన వెంట కొడిమల అప్పారావు, జవ్వాజి అప్పారావు, నరుకుళ్ల రాధాకృష్ణ, మోరంపూడి కృష్ణ, పాలకుర్తి రాజా, మాచినేని నరేంద్ర ఉన్నారు.

పెనుబల్లి, మే 23: కల్లూరు మండలం బత్తులపల్లి గ్రామానికి చెందిన బొగ్గుల రామిరెడ్డి మాతృమూర్తి నాగమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత నాగమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. సండ్ర వెంట అవులూరి నాగిరెడ్డి, కొర్ర కృష్ణ, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

విత్తన షాపును ప్రారంభించిన సండ్ర

తల్లాడ, మే 23: కేశవాపురం మాజీసర్పంచ్ అశోక్ తల్లాడలో ఏర్పాటు చేసిన శ్రీసిద్ధి వినాయక ట్రేడర్స్ షాపును మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం ప్రారంభించారు. సండ్ర మాట్లాడుతూ సరైన ధరలకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను, పురుగుమందులను ప్రజలకు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మాజీఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వెంకటలాల్, కేతినేని చలపతిరావు, బద్ధం కోటిరెడ్డి, జీవీఆర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సత్తుపల్లిటౌన్, మే 23: ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన రూ.1.60 లక్షల చెక్కును మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన దామెర్ల జానకీరామారావుకు మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శీలపురెడ్డి కృష్ణారెడ్డి, సందీప్‌కుమార్, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సుశీలమ్మ మృతికి నామా సంతాపం

ఎర్రుపాలెం, మే 23: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొమ్మూరి గోపాలరావు మాతృమూర్తి సుశీలమ్మ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీఎంపీ నామా నాగేశ్వరరావు ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించారు. సుశీలమ్మ మృతిపట్ల విచారం వ్యక్తం చేసి గోపాలరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పశువుల రవాణాలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎస్పీ ప్రసాదరావు

వైరాటౌన్/ బోనకల్లు, మే 23: పశువుల రవాణాలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీసీపీ ప్రసాదరావు హెచ్చరించారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాలడుగులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టను సందర్శించి పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. పశువులను రవాణా చేసే ప్రతి వాహనానికి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకొని శాంతి భద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకురావద్దని అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి హల్‌చల్

మామిళ్లగూడెం, మే 23 : ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు లలిత్‌బరిహ అనే వ్యక్తి పుట్ ఓవర్‌బ్రిడ్జిపై నుంచి దూకేస్తానంటూ హల్‌చల్ చేస్తూ హంగామా సృష్టించాడు. దీంతో అతడిని కాపాడేందుకు కానిస్టేబుళ్లు ప్రయత్నించడంతో అక్కడి నుంచి కిందకు దూకాడు. అప్పటికే సిద్ధంగా ఉన్న ఆర్‌పీఎఫ్ బృందం, ఫైర్ సిబ్బంది వల సహాయంతో బాధితుడిని కాపాడారు. దీంతో అక్కడ ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

హల్‌చల్ చేసిన వ్యక్తిని కాపాడి తీసుకెళ్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

30న సీపీఎం ధర్నా

కారేపలి, మే 23: ఈ 30వ తేదీ ఉదయం 10గంటలకు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మాణిక్యారంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించడమే కాక కొలతల విధానం తీసుకొచ్చి రెండు పూటల పని పద్ధతి పని ప్రదేశంలో ఫోటో దించి పే స్లిప్పు ఇవ్వకుండా గుట్టలపై పని చేయిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎడ్లపల్లి సైదులు, డేగటి గోపాల్, పోతర్ల నాగేశ్వరరావు, వడ్డూరి వీరబాబు, గోసుల పుల్లమ్మ, సరస్వతి, కుర్ర లక్ష్మి, రాజు, మౌనిక, రమ్య, సాయమ్మ, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
టెలికాలర్స్ కావలెను
★ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు మంచి వాక్ చాతుర్యం కలిగిన మహిళ టెలికాలర్ కావలెను. జీతం : 10,000/- నుండి 20,000/-వరకు ఇవ్వబడును. సంప్ర: 8297529999
KMM-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616